4)

# బ్రహ్మరాక్షసులు

"ఏ లక్షాధికార్నిగాని, కోటీశ్వరుణ్ణిగాని బ్రహ్మరాక్షసి పట్టగా చూశారూ! ఎట్లాచూస్తారూ! బ్రహ్మరాక్షసులు దరిద్రుల్నీ, అమాయకుల్నీ, ఆర్తుల్నీ పట్టి రక్తంపీల్చేస్తాయి" అన్నారు గురువుగారు.

"ఎంచేతండీ గురువుగారూ?" అన్నాం.

"దాని కెన్ని కారణాలన్నా చెప్పొచ్చు. కష్టాలు ఒంటరిగా రావనీ తగిలినవేలుకే తగుల్తుందనీ వినలా? ... కాని ముఖ్యమైన కారణం ఒకటుంది–బుద్ధిమంతులు తెలుసుకోవాల్సిన కారణం. బ్రహ్మరాక్షసి స్వతహాగా ఎటువంటిదైతే కుంగిపోయినవాళ్ళమీదికి వెళుతుంది?" అన్నారు గురువుగారు.

"అది పిరికిదై ఉండాలి...నీచమైనదయి ఉండాలి... నిజంగా బలం గలది కాదై ఉండాలి" అని రకరకాలుగా జవాబిచ్చాం.

గురుగారూ మా జవాబులన్నిటికీ తల ఒగ్గారు.

"అయితే మరి; గురువుగారూ! ఈ బ్రహ్మరాక్షసులు చేసే దారుణ కృత్యాలు అమానుషంగా ఉన్నాయే. ఇవి ప్రజల రక్తాన్ని ఇట్లా ఏర్లుగట్టి పారిస్తున్నాయే. ఇంత హింసాకాండ నడిపిస్తున్నాయే ఇంత భీభత్సం కలిగిస్తు

న్నామే. పిరికివాళ్ళకీ బలహీనులకీ ఇంతశక్తి ఎట్లావస్తుందండీ?" అని అడిగాం.

"చావుకళ్ళ జూసేపిల్లిని చూశారా? ఎంతభీభత్సంగా తయారవుతుందో?" అన్నారు గురువుగారు.

"అటువంటి పిల్లికూడా కనపడినంత భీభత్సంగా ప్రవర్తించదే?" అన్నాం.

"ఈ బ్రహ్మరాక్షసులకు పిరికితనంతోపాటు, అశక్తితోపాటు, దుర్జనత్వంతోపాటు ఇతర మద్దతుకూడా ఉంది." అన్నారు గురువుగారు,

"ఏమిటండీ ఆ మద్దత్తూ?" అని అడిగాం.

'అది చెబితే వినవలసిందికాదు, చూడవలసిందే! రండి నా వెంట" అన్నారు గురువుగారు.

గురువుగారివెంట బయల్దేరాం.

ఒకచోట భూతమాంత్రికులు పోగై ఉన్నారు. వారిని చూస్తేనే మా ప్రాణాలు లేచివచ్చినాయి వారి వాలకాలూ వేషభాషలూ ఎటువంటి పిశాచాలనైనా పారదోలేటందుకు తాహతుగలపిగా కనిపించినై. వారి ధ్వజాలమీద "ఉత్తిష్ఠంతు భూత పిశాచాః," అనీ "సర్వే జనాస్సుఖినోభవంతు" అనీ పెద్ద అక్షరాల్తో ఉంది...బ్రహ్మరాక్షసుల బలం నిరూపించటానికి గురువుగారు మమ్మల్ని ఇక్కడకెందుకు తెచ్చారా అని మాలో మేం చాలా ఆశ్చర్యపడిపోయినాం.

మా విస్మయం గ్రహించి గురువుగారు, "కాస్త వారి సంభాషణ ఆలకించండి" అన్నారు. గురువుగారి ఆదేశానుసారం భూతమాంత్రికుల సంభాషణ చెవిఒగ్గి విన్నాం.

"వెనకటికీ ఇప్పటికీ పరిస్థితులు మారాయి. మన బ్రహ్మ రాక్షసులని మనం బలపరచాలి. వాళ్ళు మనవాళ్లు. వాళ్ళే మనం. మనమే వాళ్ళు. మనం పోరాడవలసింది పైనుంచి ఆవాహన అయ్యే బ్రహ్మరాక్షసుల్తో!" అంటున్నాడొక గణాచారి.

"నిన్ననే మనబొర్ర బ్రహ్మరాక్షసిగారు నాతో ఏమని సెలవిచ్చారంటే ఈ వీర భేతాళరాయళ్ళను హత మార్చటానికి కొన్ని ఆలోచనలు చేశామన్నారు" అన్నాడు మరో పిశాచ భయంకరుడు.

"ఇటువంటి బ్రహ్మరాక్షసులు మనవేపుండటం ఎంత మంచిదయిందిరా !" అన్నాడు మరోపిండె.

"అయ్యా గురువుగారూ, వీరెవరూ బ్రహ్మరాక్షసులను మారణ హోమంచేసే ప్రయత్నంలో లేరే. ఇంతకన్న పెద్ద కార్యక్రమంలో ఉన్నారా ఏమిటి? పైనుంచి ఆవాహన అయిన బ్రహ్మరాక్షసు లున్నాయటగా ?" అన్నాం.

"అవును అవి యిక్కడ బ్రహ్మరాక్షసుల అతిథులే. వాటి మారణ హోమంకూడా జరగవలసిందే. ఆ విషయం కూడా మన భూతమాంత్రికుల అభిప్రాయాలు విందాం, ఉండండి" అన్నారు గురువుగారు.

"వాళ్ళదేముందిరా ! పొండి అని అందరమూ ఒక్క సారి పెడబొబ్బ పెడితే పుంజాలుతెంచుకుని పరిగెత్తరూ ? అసలు పోతామని వాళ్ళే అంటున్నారు. మన కెందుకొచ్చిన కంఠశోష ? అసలు మనం మారణహోమం చెయ్యవలసింది యీ భేతాళరాయళ్ళని !" అన్నాడు మరో చింపిరితల.

"ఎవరండీ యీ భేతాళరాయళ్ళు?" అన్నాం.

"వాళ్లూ బ్రహ్మరాక్షసులను వేటాడేవాళ్ళే" అన్నారు గురువుగారు.

"మరి వాళ్ళకూ వీళ్ళకూ తగువు వేం?" అన్నాం.

"వాళ్ళు ముగ్గులేసి, హ్రీం హ్రాం హ్రూం అనరు. బ్రహ్మరాక్షసులపీడకు గురిఅయినవాళ్ళదగ్గిరికి పోయి ధైర్యం యిస్తారు. వాటి నెరుర్కొనే సాధనాలు చెబుతారు.

"ఈ భేతాళరాయళ్ళ మూలంగానే ప్రజలు నిష్కారణంగా అల్లాడిపోతున్నారు. ప్రజలు నోరు మూసుక్కూచుంటే బ్రహ్మరాక్షసుల కింత కోపం రాకపోను. "సర్వేజనా సుఖినో భవంతు" అనే మన నినాదానికి వీళ్లు వ్యతిరేకంగా వున్నారు. "ఉత్తిష్ఠంతు భూతపిశాచాః" అనేదిమాత్రం మనదగ్గిర నేర్చుకున్నారు. భేతాళరాయళ్ళు నశించాలి. దేశంలో శాంతి రావాలి" అన్నాడొక భూత మాంత్రికశ్రేష్ఠి.

"వీళ్ళు చెప్పేముక్కలో అర్థం వుందాండి, గురువుగారూ? బ్రహ్మరాక్షసిని చంపినకొద్దీ దాని బలం హెచ్చిపోతుందంటాడేమిటి యీ అబ్బి?" అన్నాం.

"అంతే. వాళ్ళముక్కల్లోవున్న అర్థం" అన్నారు గురువుగారు.

"ఐతే గురూజీ! మాకు ఒక బ్రహ్మరాక్షసిని చూపిస్తారా అని అడిగాం.

"ఒకటేమిట్రా? వంద చూపిస్తాను. రండి నా వెంట" అన్నారు గురువుగారు.

ఒక బ్రహ్మరాక్షసిని యిద్దరు పట్టుకొచ్చి కారులో యెక్కిస్తున్నారు. "సీ, ఎదవా! సగం బుద్ధి అయిన యెశావు కావు. సరిగా పట్టుకోలేవేం?" అంటున్నది పప్పుజారినట్టు జారుతూ.

ఇంకోచోట యింకో బ్రహ్మరాక్షసి ఒక జోగందాని ఒళ్ళో మొహంపెట్టి వెక్కి వెక్కి ఏడుస్తూ "నూ రేపిల్లా వుంటే చచ్చిపోతానే!" అంటున్నది.

మరోచోట మరో బ్రహ్మరాక్షసి తన యాభై వేల రూపాయల కారులో వెనకాల సీటులోకి గుర్రప్పిల్ల నెక్కిస్తు "బద్దరం బద్దరం" అని కేక వేస్తున్నది.

మేం ఆశ్చర్యంతో స్తంభించిపడి, "ఇవేనా గురూజీ బ్రహ్మరాక్షసులు?" అని అడిగాం.

"ఇవి బ్రహ్మరాక్షసులు కాకపోతే బ్రహ్మరాక్షసి అనేది యెక్కడా లేదు" అన్నారు గురువుగారు.

"దయ్యం అబద్ధం, దయ్యాన్నికొట్టే దెబ్బలు నిజం" అన్నాడు మాలో ఒకడు.

'గంగానమ్మ జాతర్లలోనే ఈ బ్రహ్మరాక్షసి కొలుపులు కూడా ఆచారంగా సాగుతున్నాయి. ఒక్క శాసనంతో రెండూ చెల్లూ!" అన్నాడు మాలో మరొకడు.

"ఆ శాసనం జరక్కుండా అడ్డపడేదే బ్రహ్మరాక్షసి. ఇప్పుడు చెప్పండి బ్రహ్మరాక్షసి నిజమా, అబద్ధమా?" అన్నారు గురువుగారు.

మేం ఆలోచనలో పడ్డాం.